# ఫాశిస్టుశక్తులకు, వారి భావాలకు వ్యతిరేకంగా పోరాడండి

## భారత దేశంలోని నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించండి

**భారతదేశం** అర్ధవలస – అర్ధభూస్వామ్య సమాజం. సామ్రాజ్యవాదులకు లోబడివుంటూ, వారిసేవలో మునిగిపోయి పనిచేస్తున్న దళారీ బూర్జువావర్గం, భూస్వామ్యవర్గాలే ఇక్కడ పాలక వర్గాలుగా వున్నాయి. అందువల్ల, రాజ్యం అనేది వారి వర్గపాలనకు ఒక సాధనంగా వున్నది. ప్రజాస్వామ్యమనే ముసుగు వేయబడినప్పటికీ ఇది స్వభావరీత్యా నిరంకుశమైనది.

భారతదేశానికి లిఖిత రాజ్యాంగం వుంది. ఇది ఎన్నికల వ్యవస్థ, పార్లమెంటరీ వ్యవస్థలను కలిగి వున్నది. ఐతే యివి తీవ్రమైన ఆర్థిక, సామాజిక అసమానతపై ఆధారపడి వున్నాయి. తక్కువ ఓట్లు సాధించిన పార్టీ అయివుండి కూడా ఎక్కువసీట్లు సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలుగుతున్నాయన్న వాస్తవం, ఈ “ప్రజా స్వామ్యపాలన” యొక్క డొల్లతనాన్ని బహిర్గతం చేస్తుంది. భారత ప్రజలు ప్రజాస్వామ్యాన్ని అనుభవిస్తున్నారని చెప్పడం హాస్యాస్పదమవు తుంది. ప్రజల జీవితానుభవాలే ఇందుకు సాక్ష్యం.

భారత పాలకవర్గాలకు అనేక రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అవి తమను తాము జాతీయ పార్టీలుగాను, ప్రాంతీయ పార్టీలు గాను పిలుచుకుంటున్నాయి. అధికారంకోసం పోటీపడుతున్నాయి. కొన్ని సమయాల్లో ఈ పోటీ వీధికుక్కల కొట్లాటను పోలిన వికృతరూపాన్ని సంతరించుకుంటోంది. గడచిన ఏడు దశాబ్దాలలో కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాల్లోనూ అత్యధికకాలం కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుంది. కొన్ని సందర్భాలలో పాలకవర్గాలకు చెందిన ఏదో ఒక ప్రధానపార్టీ నాయకత్వం వహించిన సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలో వున్నాయి. గత 5 సంవత్సరాలుగా బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలో వుంది. ఈ పార్టీలు ఓటర్లను ఆకట్టుకోవడానికి రకరకాల నినాదాలను, హామీలను గుప్పిస్తుంటాయి. అవినీతికర, మోసపూరిత పద్ధతులు అనుసరించడంలో ఎంత నీచస్థాయికి దిగజారడానికైనా వీరు సిగ్గుపడరు. ప్రతి పాలకపార్టీ తమ విధానాలు మాత్రమే ప్రజలకు ఉజ్వలభవిష్యత్తు అందించగలవని ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తుంది. ఇవి ఉద్దేశ్యపూర్వకంగానే ప్రజల మౌలిక సమస్యలను ప్రస్తావించకుండా దాటవేస్తాయి. సామ్రాజ్యవాద, దోపిడీవర్గ ప్రయోజనాలకు వూడిగం చేయడానికే కట్టుబడివున్నారన్న విషయాన్ని అవి ఎన్నడూ అంగీకరించవు. ఈ పార్టీలు అసలు సమస్యల నుంచి ప్రజల్ని పక్కదారి పట్టిస్తుంటాయి. అదే సమయంలో, తాము ఎన్నికల్లో గెలిస్తే పాత విధానాలనే కొత్త పేర్లతో ప్రత్యర్థి పార్టీల కంటే గొప్పగా అనుసరించగలమని భారత పాలక వర్గాలను, వారి సామ్రాజ్యవాద ప్రభువులను నమ్మించటానికి ప్రయత్నిస్తాయి.

భారత పాలకవర్గాలు, వాటి ప్రభుత్వాలు అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రధానంగా రెండురకాల ఆయుధాలను వినియోగిస్తుంటాయి. ఒకటి:ప్రజలను భ్రమల మత్తులో ముంచెత్తడానికి ఉద్దేశించిన జనాకర్షక నినాదాలు, తాయిలాలు; ప్రజల సంఘటిత, ఐక్యపోరాటాల నుండి ప్రభుత్వాలు తప్పించుకొనడానికిగాను ప్రజలను విడదీసి ఒక సెక్షన్ ప్రజల్ని మరొక సెక్షన్ పైకి ఉసిగొల్పడానికి, పక్కదారి పట్టించడానికి వుద్దేశించిన ఎత్తుగడలు. రెండోది: అనేక రకాల అణచివేత పద్ధతులద్వారా పోరాటాలను తుడిచి వేయడానికి తీవ్రమైన ఫాశిస్టు పద్ధతులకు పాల్పడడం.

అధికార మార్పిడి జరిగిన ప్రారంభ దశాబ్దాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చాలా ప్రగతిశీల వాగాడంబరాన్ని వుపయోగించింది. కానీ, సామ్రాజ్యవాదుల దోపిడీకి తలుపులు బార్లాతెరిచి మన ప్రజల జీవితాలను, మన ఆర్థిక వ్యవస్థను అదుపుచేసే మీటలను వారికి అందించకుండా భారత పాలకులను అదేమీ నిరోధించలేదు. తెలంగాణ, వర్లీ (మహారాష్ట్ర), త్రిపుర తదితర రాష్ట్రాల్లో వెల్లువెత్తిన మిలిటెంట్, విప్లవ రైతాంగ ఉద్యమాలను అణచివేయడానికి వారు పాశవిక బలాన్ని వుపయోగించారు.

భారత పాలకులు రెండు యుద్ధాలు చేశారు. ఒకటి: 1962లో చైనాతో–మరొకటి 1965లో పాకిస్తాన్‌తో. అప్పుడు వారు తీవ్రమైన ఆర్థిక, రాజకీయ సంక్షోభంగుండా పయనిస్తున్నారు. ఆర్థిక సహాయంకోసం, పెట్టుబడుల కొరకు, అమెరికా సామ్రాజ్యవాదుల ముందు నిస్సిగ్గుగా మోకరిల్లుతున్నారు. అది ప్రజాపోరాటాలు, ఉద్యమాలు వెల్లువెత్తుతున్న కాలం కూడా. భారత పాలకవర్గాలు దేశంలో పచ్చి జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టడానికి యుద్ధాన్ని, యుద్ధోన్మాదాన్ని వినియోగించుకున్నారు. ప్రజలను ఉక్కు పిడికిలితో అణచివేయడంలో భాగంగా డిఐఆర్, పిడి చట్టాల క్రింద అనేక మంది కమ్యూనిస్టులను జైల్లోకి నెట్టారు. ఈ రెండు సందర్భాల్లో కమ్యూనిస్టులు చైనా అనుకూలురు గానో లేదా పాకిస్తాన్ అనుకూలురుగానో మరియు జాతీయ భద్రతకు ముప్పుగానో ముద్ర వేయబడ్డారు. ఈ యుద్ధాలు భారత దేశానికి తీవ్రమైన ఆర్థిక, ప్రాణ నష్టాలను కలిగించాయి. సంక్షోభం మరింత తీవ్రమవడానికి కారణ మయ్యాయి. పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల అప్పుల ఉచ్చులో మరింత లోతుగా కూరుకు పోయారు. ఆర్థిక సంక్షోభ భారాన్ని, యుద్ధ మూల్యాలను చెల్లించడానికి ప్రజలు అనేక అవస్థలు పడాల్సివచ్చింది.

సహజంగానే ప్రజల్లో అసంతృప్తి, నిరసన, పోరాటాలు వెల్లువెత్తాయి. దేశం రెండురకాల పరిణామాలను చూసింది.

1. భారత దేశంలో వున్నది సమాఖ్యవ్యవస్థ కాదని ఆచరణలో బాగా బహిర్గతమౌతూ వచ్చింది. కేంద్రం చేతిలో అధికార కేంద్రీకరణ భరించలేని విధంగా తయారైంది. ఇది కేంద్రంలో వున్న కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్త “సాధారణ నిరసన ఉద్యమం” ముందుకు రావడానికి అనుకూలమైన రాజకీయ వాతావరణాన్ని సృష్టించింది. జనబాహుళ్యం తమ ప్రజాస్వామిక డిమాండ్లను

ముందుంచారు. కేంద్రంలోని నిరంకుశపాలనకు వ్యతిరేకంగా నిలిచారు. పాలక వర్గాల్లోని కొన్ని సెక్షన్లు తాము అధికార పీఠాన్ని అధిష్టించడానికి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన నిరసన ఉద్యమాల్ని ఒక నిచ్చెనలాగా చూశాయి. పాలకవర్గాల నడుమ వైరుధ్యాలు తీవ్రమవటాన్ని కూడా ఈ పరిణామాలు ప్రతిబింబించాయి.

2. గ్రామీణ భారతం సంక్షోభంలో వుంది. అనేక ప్రాంతాల్లో ఫ్యూడల్ భూస్వామ్య వర్గాలకు, శ్రమజీవులైన రైతాంగానికి మధ్య వైరుధ్యాలు బద్దలయ్యే స్థాయికి చేరాయి. వ్యవసాయ విప్లవంద్వారా భూములను సమూలంగా పునః పంపిణీ చేయడంద్వారా దీన్ని పరిష్కరించాల్సిన అవసరాన్ని ఈ పరిస్థితి ముందుకు తెచ్చింది. నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ విప్లవోద్యమాలు ఈ క్రమంలో ముందుకు వచ్చినవే. కమ్యూనిస్టు విప్లవ రాజకీయాలు, సంస్థలు – ఆ కాలపు అనివార్యతగా రాజకీయరంగం మీదికొచ్చాయి. ఉద్యమాలను, వాటి నాయకత్వాన్ని అణచి వేయటానికి భారత పాలకవర్గాలు ఫాశిస్టు పద్ధతులను ఉపయోగించాయి.

1971లో భారత పాలకులు పాకిస్తాన్‌తో మరో యుద్ధానికి తలపడ్డారు. ఆర్థిక సంక్షోభం పెరుగుతూ పాలకవర్గాల మధ్య వైరుధ్యాలు తీవ్రమౌతున్న సందర్భం అది. భారతపై పైచేయి సాధించటానికి అమెరికా, రష్యాలమధ్య పోటీ తీవ్రమవుతున్న రోజులు కూడా అవి. ఆ సమయంలో రష్యావైపు మొగ్గుచూపుతున్న ఇందిరాగాంధీ నేతృత్వంలోని భారతప్రభుత్వం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా యుద్ధానికి వెళ్లింది. బంగ్లాదేశ్‌ని సృష్టించడంలో నిర్ణయాత్మక పాత్రను పోషించింది. పాలకులు ఈ యుద్ధాన్ని-ప్రజల మధ్య జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టడానికీ, ప్రజలపైన, ప్రజాస్వామిక శక్తులపైన, కమ్యూనిస్టుల పైన నిర్బంధాన్ని ప్రయోగించటానికి వినియో గించుకున్నారు. యుద్ధానంతర కాలంలో ఆర్థిక సంక్షోభం, పాలకవర్గాల మధ్య వైరుధ్యాలు, ప్రజల అసంతృప్తి, ఉద్యమాలు మరింత తీవ్రతరమయ్యాయి.

భారత ప్రభుత్వం ద్విముఖ దాడులకు పాల్పడింది. భూసంస్కరణలు, బ్యాంకుల జాతీయాకరణలాంటి ప్రజాకర్షక చర్యలు చేపట్టడంతోపాటు ప్రజలపైన, ప్రజాస్వామిక శక్తులపైన, కమ్యూనిస్టు విప్లవకారులపైన నిర్బంధాన్ని తీవ్రతరం చేసింది. కాంగ్రెస్ చీలిక నెదుర్కొన్నది. ఇందిరాగాంధీ నాయకత్వంలోని సెక్షన్ అధికారాన్ని మరింతగా తమ గుప్పిట్లో కేంద్రీకరించుకొనే వైపుగా సాగింది. కాగా ప్రతిపక్షంలోవున్న పాలకవర్గంలోని మిగతా సెక్షన్ అవినీతి, నిరంకుశపాలన తదితర సమస్యలపైన విశాల ప్రజాస్వామిక ఉద్యమాన్ని నిర్మించే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. విద్యార్థులు, యువకులు, తదితర వర్గాల ప్రజలతోపాటు ప్రజాస్వామికశక్తులు కూడా ఈ నిరసన ఉద్యమంలోకి సమీకరించబడ్డారు.

రాజకీయ సంక్షోభం పతాకస్థాయికి చేరి భారీ నిరసనోద్యమాలు చుట్టుముట్టిన సమయంలో ఇందిర ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించింది. అది ఫాశిస్టు తరహా పాలనే. విప్లవకారులు, కమ్యూనిస్టులు, ప్రజాస్వామికసంస్థలు, వ్యక్తులు, ప్రతిపక్షంలోవున్న పాలకవర్గ సెక్షన్లతోసహా విస్తారమైన రాజకీయశక్తులు ఆ తీవ్ర తాకిడికి గురయ్యారు. విప్లవసంస్థలను, ప్రజాసంఘాలను –వారి పత్రికలను, కార్యకలాపాలను నిషేధించారు. అనేక రాజకీయసంస్థలకు చెందిన నాయకులు, శ్రేణులను పెద్దఎత్తున జైళ్ళలోకి నెట్టారు. కనీస ప్రజాస్వామిక, పౌరహక్కులు కూడా లేకుండా చేసి, చీకటి పాలనలోకి నెట్టారు. ఎమర్జెన్సీతో పాటు తీసుకొచ్చిన 20 సూత్రాల పథకం ఎమర్జెన్సీ అనే చేదు గుళికను ప్రజలచేత మింగించటానికి తీసుకొచ్చిన సుతిమెత్తటి ఆయుధంతప్ప మరేమీ కాదు.

దీనిని వ్యతిరేకిస్తున్న శక్తులు, ఎమర్జెన్సీ పాలన ఎత్తివేయటానికి, విస్తృత ప్రాతిపదికన ప్రజాస్వామిక ఉద్యమంలోకి ప్రజల్ని కదిలించాలని చూశాయి. ఎమర్జెన్సీ ఎత్తివేయబడిన వెంటనే ఇందిర పాలనను వ్యతిరేకించిన అనేక పార్టీలు తమను తాము ఐక్యపరచుకోవడానికి, ప్రజల అసంతృప్తిని ఓట్ల రూపంలోకి మార్చుకొని తమ స్వంత పాలనను నెలకొల్పుకొనే ప్రయత్నాల్లో మునిగిపోయాయి. ఎమర్జెన్సీ పాలన తర్వాత వేసిన “షా” కమీషన్ ద్వారా ఎమర్జెన్సీ దురాగతాల్లో అతి కొద్దిభాగం మాత్రమే వెలుగులోకి వచ్చాయి.

**ఈ అనుభవాలు కొన్ని విషయాలను సుస్పష్టంచేశాయి**

1. భారత ప్రజలపైన తమ పీడక పాలనను రుద్దటానికి వలస పాలకులు రూపొందించి, ఉపయోగించిన అన్ని నిర్బంధ శాసనాలను, సంస్థలను భారత రాజ్యాంగం తన కడుపులో పెట్టుకొని మోస్తోంది. ప్రజల ప్రాథమిక హక్కులను రద్దుచేసే దాకా వెళ్లడానికి పాలకులకు అధికారాన్ని కల్పిస్తుంది. రాజ్యాంగంద్వారా సంక్రమించిన అధికారాల పేరుతో భారత పాలకులు తమ ప్రజావ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాల నన్నింటినీ ముందుకునెట్టి సమర్థించుకోగలుగు తున్నారు.

భారత పాలకులు కమ్యూనిస్టులపైన, ప్రజాస్వామికశక్తులు, కార్మికులు, రైతాంగం, గిరిజనులు, దళితులు, మహిళలు, విద్యార్థులు, యువత, దేశభక్తులపైన, జాతులపైన, మతపరమైన మైనారిటీలపైన ప్రయోగించని చట్టమంటూ లేదు. ఈ చట్టాల్లో క్రిమినల్ చట్టాలు, DIR, PDA, TADA, POTA, NSA, UAPA, AFSPA, కల్లోలిత ప్రాంతచట్టం లాంటి లెక్కలేనన్ని ప్రత్యేక చట్టాలు వున్నాయి. అనేక రాష్ట్ర చట్టాలు కూడా వున్నాయి. ఎమర్జెన్సీని ప్రకటించడానికి అధికారాలు, దేశద్రోహచట్టాలు, ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛలను రద్దుపరిచే రాజ్యాంగ వెసులుబాట్లు, భావప్రకటనా స్వేచ్ఛపైన సభలు కార్యక్రమాలపైన ఆంక్షలు, నిషేధాలు అమలుచేయటానికి అవసరమైన అధికారాలు, సమాచార వ్యవస్థపైన నిఘా, ఎన్‌కౌంటర్‌లు, కూంబింగులు, చుట్టుముట్టటాలు, గ్రామాలను, జనావాసాలను మరొక చోటకు తరలించేయడం లాంటి పద్ధతులను ఉపయోగించి గ్రామాలను విచ్ఛిన్నం చేయటం, విధ్వంసం చేయటం, సాధారణ పౌర ప్రాంతాలలో మిలటరీ బలగాలను భారీఎత్తున మోహరించటం, శాంతియుత, ప్రజాస్వామిక నిరసనలపైన సైతం తమ భారీ ఉక్కు పాదాన్ని ప్రయోగించడం లాంటివి చేస్తున్నారు. రాజ్యం చాలా తరచుగా, ఇష్టానుసారంగా లాఠీలు, బాష్పవాయుగోళాలు, తుపాకులు, తూటాలు తదితర మారణాయుధా లను ఉపయోగించింది. ప్రజల గొంతును నొక్కి వేయటానికి, క్రిమినల్, కుట్రకేసుల్లో ఇరికించడ మనేది రాజ్యం చేతుల్లో ఒక ఆయుధంగా మారింది.

అధికారం చెలాయిస్తున్న ప్రతి పాలకపార్టీ ఆయా పోరాటాల లోతును, తీవ్రతను అంచనా వేసుకొని దానికి అనుగుణ్యమైనదని తాను అనుకున్న నిర్బంధ రూపాన్ని, స్థాయిని ప్రయోగించడానికి తన అధికారాలను ఉపయో గిస్తుంది. ఎందుచేతనంటే, వీటిపట్ల ప్రభావ వంతంగా వ్యవహరించటానికి ఇదొక్కటే ఏకైక మార్గమని అది నమ్ముతుంది కాబట్టి. పాలకులు తాము కోరుకున్న ఫలితాలను పొందడానికి అత్యంత క్రూరంగా వ్యవహరించడంలోనూ, రాజ్యంయొక్క నిరంకుశ ఫాశిస్టు స్వభావాన్ని నగ్నంగా ప్రదర్శించటంలోనూ, ఎంతదాకానైనా వెళుతున్నారు. పాలకులు ప్రతిసారి శాంతి భద్రతల పేరుతోనో, ప్రజాస్వామ్యం, రాజ్యంగం పేరుతోనో తమ చర్యలను సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతిపక్షంలోవున్న పాలక వర్గాల సెక్షన్లకు దీనితో విభేదమేమీ లేదు. తమ ఉమ్మడి శత్రువులైన కార్మికులు, రైతాంగం, గిరిజనులు, తదితర పీడిత ప్రజలపైన ఇవి ఎక్కుపెట్టబడ్డాయనే స్పష్టత వారికి ఉన్నంతవరకు రాజ్యం ప్రయోగిస్తున్న నిర్బంధానికి తమ మద్దతు నిస్తారు. జనరల్ ప్రజాస్వామిక నిరసనలు, లేదా పక్కదారి పట్టించే స్వభావం కలిగిన నిరసనలకు తాము నాయకత్వం వహిస్తున్నప్పుడో, లేదా మద్దతును ఇస్తున్నప్పుడో నిర్బంధానికి వ్యతిరేకంగా వీరు గొంతుపెంచటాన్ని చూస్తాము. ఇలాంటి సమయాల్లో ప్రాథమికంగా తమ స్వంత ప్రజాస్వామిక హోదాను ఎలా పెంచుకోవాలి అనే దృష్టితోనే వారు వ్యవహరిస్తారు. అధికారంకొరకు జరిగే పోటీలో ప్రజల నిరసనల నుండి రాజకీయంగా ఎలా లబ్ధిపొందాలన్నది, తమ స్వంత రాజకీయస్థితిని ఎలా మెరుగుపరచు కోవాలన్నది వారి ఆలోచనగా వుంటుంది.

2. పాలకవర్గ పార్టీల దృష్టి కోణంలో జనాకర్షక నినాదాలు, సంస్కరణలు, తాయిలాలు చక్కెర పూతవేసిన బుల్లెట్లలో భాగమే. రాజ్యహింస ద్వారా ప్రజలకైన గాయాలను మాన్పటానికి పూతమందుగాగానీ, పోరాటాల క్రమంలో ప్రజలు పాల్గొనకుండా చేయటానికిగానీ వారు వీటిని ఉపయోగిస్తుంటారు. దోపిడీ పాలకవర్గాలు పరిస్థితులకు తగినట్లుగా మారణాయాధాలను, చక్కెర పూసిన ఆయుధాలను ఏకకాలంలోగానీ లేదా ఒకదానికొకటి మరొకటిగాకాని ఉపయో గిస్తారు. ఈ రెండూ కూడా ఒకదానిలో ముఖ్యమైన భాగాలే, ఒకే నాణానికి రెండు పార్శ్వాలు. ప్రజలను అణచిపెట్టడమే వాటిఏకైక ఉద్దేశం. విభజించే, ప్రక్కదారిపట్టించే నినాదాలు, అభివృద్ధి నిరోధక భావాలు, దూషణలు, అబద్ధాలు, ఓటమి మనస్తత్వాన్ని, నిరాశా నిస్పృహలను, పతన సంస్కృతి ధోరణులను విస్తరించడం – ఇవన్నీ కూడా ప్రజలను రాజకీయంగా నిరాయుధుల్ని చేయటానికి ఉపయోగించే సుతిమెత్తటి ఆయుధాలే.

భారతదేశం అర్థవలస, అర్థభూస్వామ్య సమాజంగా వుండటంవల్ల, ఇక్కడి ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అభివృద్ధి కూడా అసమానంగానే వుంటుంది. ఆయా ప్రాంతాల్లో వున్న వర్గవైరుధ్యాల తీవ్రత కనుగుణంగా, ప్రజల చైతన్యం, వారి పోరాటాలు అసమానంగానే అభివృద్ధి చెందుతాయి. వస్తుగతశక్తుల, అంటే, పార్టీ ప్రయత్నాలు, శక్తిసామర్థ్యాలు, ప్రజల చైతన్యం సంఘటిత రూపం తీసుకొనడానికి, దోపిడీకి గురవుతున్న శ్రమజీవులు తమ పోరాటాన్ని ముందుకు తీసుకొని వెళ్లడంలో మంచి స్థితిలో వుండడానికి తోడ్పడవచ్చును. భారతదేశంలోను, ప్రపంచవ్యాపితంగానూ ఆర్థిక సంక్షోభం, భారత పాలకవర్గాల మరియు సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు తీవ్ర మవుతున్న స్థితి ప్రజల చైతన్యంపైన అనుకూల ప్రభావం పడేస్తాయనటంలో సందేహంలేదు. ప్రజల చైతన్యాన్ని, ముఖ్యంగా పునాదివర్గాల చైతన్యాన్ని, పోరాటాలను అభివృద్ధిచేసే ప్రయత్నాలపైన కమ్యూనిస్టులు తమ దృష్టి పెట్టినప్పుడు మాత్రమే వీటిని బాగా వినియోగించుకోగలగుతారు.

2014లో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటినుండి 'భారత రాజ్య స్వభావం' అన్నది మనదేశంలోని రాజకీయ వర్గాల్లో కొంత చర్చనీయాంశమైంది.

ఒకప్పుడు, ఇందిరాగాంధీ రాజకీయ పలుకుబడి ఉచ్ఛస్థితిలో వున్న సమయంలో, ఆమె వందిమాగధులు "ఇందిరే ఇండియా" లాంటి నినాదాలు జపించటం మొదలుపెట్టారు. 1975లో ఇందిరాప్రభుత్వం ఎమర్జెన్సీ పాలన తీసుకొచ్చినప్పుడు, ప్రతిపక్షాలను పెరగకుండా అడ్డుకొని, అధికారాలను మరింతగా తన గుప్పిట్లో కేంద్రీకృతం చేసుకొనే క్రమంలో ఈ చర్యకు దిగింది. సహజంగానే, అది భారత దేశంలో విస్తృత పునాది కలిగిన ప్రజాస్వామిక ఉద్యమం తలెత్తటానికి దారితీసింది.

సంఘ్‌పరివార్, భాజపాకు దిక్సూచి, దాని భావజాలం, రాజకీయాలు, ఆచరణ బహిర్గతమే. హిందూ రాజ్యం గురించి మాట్లాడుతున్న ఈ శక్తులు మనదేశంలో ముస్లిములను, యితర మతాలకు చెందిన ప్రజలను ద్వితీయశ్రేణి పౌరుల స్థానానికి తగ్గించి, హిందూత్వశక్తుల దయాదాక్షిణ్యాలపైన ఆధారపడి జీవించేట్లు చేయాలని ఇది చూస్తున్నది. దాని అశాస్త్రీయ, తిరోగామి మూఢత్వం, మతతత్వం, సంస్కృతి బాహాటంగానే అర్థమవుతున్నాయి. వాటిని మహత్తర ప్రాచీనన భారత వారసత్వంగా పొగడాలని, వాటిని గౌరవించి, సమున్నతంగా నిలపాలని భారత ప్రజలకు అది పిలుపునిస్తుంది. శాస్త్రీయ, హేతుబద్ధ, ప్రగతిశీల, లౌకిక ఆలోచనల పట్ల దాని విద్వేషం అందరికీ తెలిసిందే. డజన్ల కొద్దీ ప్రగతిశీల, ప్రజాస్వామికవాదుల, హేతువాద ప్రముఖుల హత్యలకు 'గోరక్షణ' తదితర సాకులతో డజన్లకొద్దీ పేద, దళిత, ముస్లిం ప్రజల హత్యలకు ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగాకానీ ఈ సంఘ్‌పరివారే బాధ్యులు.

సంఘ్‌పరివార్ భావజాలం, రాజకీయాలు, ఆచరణలపై పోరాడాల్సిన, ఎండగట్టాల్సిన అవసరంపైన ఇక్కడ ఎలాంటి వివాదమూ వుండాల్సిన అవసరంలేదు. కానీ ప్రశ్న ఏమిటంటే, ఫాసిజాన్ని చారిత్రక నేపథ్యంలో మనం ఎలా చూస్తున్నాం? దీనిని భారత సమాజం, భారత రాజ్యంయొక్క వర్గ స్వభావంతో కలిపి ఎలా చూడాలి? వాటిని సమర్థవంతంగా బహిర్గతపరిచి ఎలా ఎదుర్కోవాలి? అన్నదే ప్రధానమైన అంశమవుతుంది.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జర్మనీ సామ్రాజ్యవాద బూర్జువావర్గం తమను తాము తీవ్రమైన ప్రపంచ యుద్ధానికి సంసిద్ధం చేసుకొని తద్వారా ప్రపంచం మొత్తాన్నీ తమ కాళ్ళకిందకి తెచ్చుకోవడానికి ఫాసిజాన్ని మార్గంగా ఎంచు కున్నది. స్టాలిన్ చెప్పినట్లుగా "దురహంకారం, యుద్ధానికి సన్నద్ధమవడం వారి (జర్మను పాలకుల) విదేశాంగ విధానంలోని ముఖ్యాంశాలు. అదే సందర్భంలో శ్రామికవర్గాన్ని అణచివేయడం, టెర్రరిజం వారి ఆంతరంగిక విధానంగా, భవిష్యత్ యుద్ధరంగాలకు వెనుకతట్టు

బలాలను పెంచుకోవడానికి అవసరమైన మార్గాలుగా వారు అవలంబించారు."

స్టాలిన్ ఈ విషయాలను కూడా ఎత్తి చూపారు: "జర్మనీలో ఫాశిజం గెలుపుకు కేవలం శ్రామికవర్గ బలహీనత, సోషల్ డెమోక్రసీ శ్రామికవర్గాన్ని మోసగించి ఫాశిజానికి బాటలు వేయబడడానికి నిదర్శనమే కాకుండా బూర్జువా వర్గ బలహీనతకు చిహ్నం కూడా. బూర్జువావర్గం ఇంకెంత మాత్రమూ పాతపార్లమెంటరీ, బూర్జువా ప్రజాతంత్ర పద్ధతులతో పాలించలేదనడానికి, పర్యవసానంగా ప్రస్తుత పరిస్థితులనుంచి శాంతియుత విదేశాంగ విధానం ద్వారా బయట పడలేదనీ, యుద్ధవిధానాన్ని అనుసరించాల్సిన స్థితిలో పడిందనడానికి ఇది సూచిక కూడా"... (ఫౌండేషన్స్ ఆఫ్ లెనినిజం, 682)

ఫాశిజంయొక్క స్వభావాన్ని వివరిస్తూ జార్జి డిమిట్రోవ్ ఇలా అన్నారు:

"ఫాశిజం అనేది శ్రామిక జనబాహుళ్యంపై పెట్టుబడి చేసిన అత్యంత క్రూరమైన దాడి; ఫాశిజం అడ్డూ అదుపులేని జాతీయ ఉన్మాదం; దురాక్రమణ యుద్ధం; ఫాశిజం ఘోరమైన తిరోగమనం, విప్లవ ప్రతీఘాతుకం; ఫాశిజం శ్రామిక వర్గాలకు, శ్రామిక ప్రజలకు అత్యంత దుర్మార్గమైన శత్రువు".

డిమిట్రోవ్ "ఫాశిజం" అని చెప్పింది రెండవ ప్రపంచయుద్ధ కాలంలో జర్మనీలాంటి సామ్రాజ్యవాద దేశంలో ఉద్భవించిన ఫాశిజం గురించి అనేది స్పష్టం.

మరోచోట డిమిట్రోవ్ ఈ విధంగా కూడా చెప్పారు: "ఫాశిజం, ఫాశిస్టు నియంతృత్వం అభివృద్ధి అన్నవి ఆయా దేశాల చారిత్రక, సామాజిక, ఆర్థిక పరిస్థితులనుబట్టి, ఆయా దేశాల జాతీయ ప్రత్యేకతలను బట్టి లేక ఆయా దేశాల అంతర్జాతీయ స్థానాన్నిబట్టి వివిధ రూపాలను తీసుకుంటుంది".

1943లో చైనా కమ్యూనిస్టుపార్టీ చియాంగ్కై షేక్, కొమింటాంగ్ను "చైనీయ ఫాశిజం" అని పేర్కొన్నది. దానికి ఒక్క "జాతీయ దురాక్రమణ" అన్న లక్షణంతప్ప ఫాశిజం గురించి డిమిట్రోవ్ చెప్పిన అన్ని లక్షణాలూ వున్నాయని మావో అన్నారు. ఈ లక్షణం లేకపోవడానికి కారణం చైనా తానే ఒక వలసగా లేక అర్థవలసగా వుండడమని చౌఎన్లై స్పష్టపరిచారు. "చైనా బడా బూర్జువాల, బడా భూస్వాములకు ఇతర దేశాలపై దండెత్తే శక్తిలేదు" అన్నారు.

ఇతర సందర్భాలలో చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ఇలా వివరించింది: చైనా బడాబూర్జువాలు, బడాపెట్టుబడిదారులు చైనాపై జపాన్ దురాక్రమణ నెదుర్కొన్నప్పుడు స్వతంత్రంగా, నిర్ణయాత్మకంగా వ్యవహరించలేక పోయారు. ఎందుకంటే వారు దళారీలు-జపాన్ సామ్రాజ్యవాదంతోసహా ఏదో ఒక సామ్రాజ్యవాద శక్తికి వారు కట్టివేయబడి వున్నారు.

అర్థవలస, అర్థభూస్వామ్య భారతదేశంలో పాలకవర్గాలు సామ్రాజ్యవాదంతో పీటముడి వేసుకొని దానికి లోబడి మరింత పీడక కబంధ హస్తాల్లోకి మాత్రమే మన దేశాన్ని నడిపించారు. వివిధ పార్టీలద్వారా ఈ బూర్జువా పాలకవర్గాలు సాగించిన 70 ఏళ్లకు పైబడిన పాలనలో మనదేశ ఆర్థిక వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, రాజకీయాలు, వనరులు, ఇతర వ్యవహారాలపై సామ్రాజ్యవాదుల ప్రాబల్యం, పట్టు విపరీతంగా పెరిగాయి. అమెరికా నాయకత్వాన ఏర్పడిన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్లతో కూడిన వ్యూహాత్మక కూటమితో భారత దేశం ముడివేయ బడటంవల్ల ఈ దేశం, ఈ దేశప్రజలు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి వస్తున్నది. ఈ ప్రమాదకర మార్గంలోకి మనదేశాన్ని కాంగ్రెస్, భాజపా మరియు ఇతర పాలకవర్గ పార్టీలే నడిపించాయి.

మనదేశ పాలకవర్గ పార్టీలు తమను తాము విభిన్నంగా చూపించుకునే ప్రయత్నంలో అధికారంకోసం పోటీపడే తమ ప్రత్యర్థులను చిత్తుచేయడానికి; తాము లక్ష్యంగా పెట్టుకొన్న ప్రజలను ఆకట్టుకొనడానికి, వారిపైన తమ పట్టును స్థిరపరచుకొనడానికి రకరకాల భావజాలాలతో, రాజకీయాలతో నినాదాలతో ముందుకొస్తారు. అధికారంకోసం వీధికుక్కల్లా కాట్లాడుకోవడానికి కూడా వీరు వెనుకాడరు. ఐతే ఈ పార్టీలకు అధికారంకోసం తాము పడే పాట్లలో సామ్రాజ్యవాదుల అండదండలు అవసర మవుతాయనీ తెలుసు. సంపాదించుకున్న అధికారాన్ని పాలకవర్గాల, సామ్రాజ్యవాద యజమానుల ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించాల్సి వుంటుందనీ వారికి తెలుసు.

భాజపా, దాని మూలవిరాట్ సంఘ పరివార్ తమ భావాలతో ప్రజలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అందులో ఏమాత్రం సందేహంలేదు. అయితే తాము అధికారపీఠం చేరుకోవాలంటే తాము ఏర్పాటు చేయబోయే ప్రభుత్వం భారత పాలకవర్గాలకు, సామ్రాజ్యవాదులకు మరింత మెరుగుగా సేవ చేయగలదని నమ్మించగలగాలి. వారి భావ జాలాలు, వారి నినాదాలు వాటి బోధకులకు ప్రీతికరంగానే వుంటాయి. కాని వారు ఈ కుర్చీ వేటలో వున్నంతవరకూ తమ భావజాలాలను, నినాదాలను భారత పాలకవర్గాల, వారి సామ్రాజ్యవాద యజమానుల వర్గప్రయోజనాలకు సేవచేయడానికి తగినట్లుగా మలుచుకోవాలి; స్వరం కలుపుకోవాలి. వాటిని ఒక పరిధి దాటి ముందుకు తీసుకెళ్లనూలేరు. అలానే పాలక వర్గాల, వారి సామ్రాజ్యవాద యజమానుల ప్రయోజనాలకు వ్యతిరేకంగానూ తీసుకెళ్లలేరు.

భారత పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు భారతదేశంలో వారు ఆధారపడగల ఏకైక రాజకీయశక్తి భాజపా మాత్రమే అన్న నిర్ధారణకు వచ్చారని చెప్పగలమా? సంఘపరివార్ "హిందూ రాష్ట్రం" అని భయపెడుతూ తేవడానికి జూస్తున్న మతవిభజనను భారత జనబాహుళ్యం జరగ నిస్తుందా? పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు వారికి దశాబ్దాలుగా సేవచేసిన కాంగ్రెసు, ఇతర పార్టీలను భాజపాకోసం వదులుకోగలరా? భారత పాలకవర్గాల, సామ్రాజ్యవాదుల ముందున్న ప్రశ్న ఒకరిస్థానే మరొకరిని ఎల్లకాలంకోసం ఎంచుకోవడంకాదు. వారి ప్రధాన సమస్య: ఒక నిర్దిష్ట కాలపరిస్థితిలో ఏ పార్టీ లేక కూటమి ప్రజలను తమ వెంట వుంచుకొంటూ వారికి బాగా సేవచేయగలుగుతుందా అన్నదే. ప్రస్తుత మున్న పార్టీనో, నాయకుడో ప్రజలపై పట్టు కోల్పోయి తమకు సేవలు సరిగ్గా చేయలేని స్థితిలో పడితే అట్టివారిని మార్చేయడానికి వారు ఏమాత్రం సంకోచించరు. అలాగే మళ్ళీ ఉపయోగపడతాడు అనుకున్నప్పుడు దించేసిన వాడినే తిరిగి తీసుకురావడానికి వారికి ఏ ఇబ్బందీ వుండదు.

మనదేశంలో వర్గవైరుధ్యాలు, ప్రధానంగా ఫ్యూడలిజానికి – విశాల జనబాహుళ్యానికి; సామ్రాజ్యవాదానికి-భారత ప్రజలకు

మధ్యవున్న వైరుధ్యాలలో, లేదా వీటిలో ఏదో ఒకటి బద్ధలయ్యే స్థాయికి చేరిందని, భారత రాజ్యాన్ని, సామ్రాజ్యవాదాన్ని ఇప్పుడున్న ఈపాటి ప్రజాస్వామ్యాన్ని కూడా కూలదోసి, ఫాశిస్టు నియంతృత్వాన్ని ఎంచుకునే పరిస్థితి వచ్చిందని మనం చెప్పగలమా? ఇదేగనక వాస్తవమైతే, ప్రధానంగా విప్లవ కమ్యూనిస్టులు ఈ సవాలును ఎదుర్కొనడానికి తగినట్లుగా తమను తాము రాజకీయంగా, నిర్మాణపరంగా, ఆచరణలో మలుచుకోవలసిన అవసరం వుంటుంది కదా?

ప్రపంచంలో భారతదేశంలాంటి దేశాలలో సామ్రాజ్యవాదులు వివిధ రూపాల ప్రభుత్వాలతో కొనసాగుతున్నారు. ఫ్యూడల్ రాజరిక ప్రభుత్వాలు, మిలిటరీ మరియు ఫాశిస్టు నియంతృత్వ ప్రభుత్వాలు, వివిధ రకాల ప్రజాస్వామిక పాలనతో సహా పరిపాలకులంతా సామ్రాజ్యవాదానికి లొంగి పనిచేస్తున్నవారే. సామ్రాజ్యవాదులు తమకు నమ్మకమైన దళారులకు, తొత్తులకు సంబంధించిన వివిధ సెక్షన్లను మేనేజ్ చేయటానికి, వివిధ పద్ధతులను, మెళుకువలను పెంపొందించారు. అస్థిర పరిస్థితులను, రాజకీయ సంక్షోభాలను అధిగమించటానికి వారు ప్రభుత్వాలను మార్చటంతోపాటు, ప్రజలలో అసంతృప్తిని అణచివేయడానికి ఉక్కు పిడికిలిని ఉపయోగిస్తున్నారు. భారతదేశం విషయంలో జరుగుతున్నది కూడా యిదే.

పాలక వర్గాలు, సామ్రాజ్యవాదులు సమాజంలో టెర్రరిస్టులను మరియు ఫాశిస్టు శక్తులను పెంచిపోషిస్తున్నారు. వాస్తవ సమస్యల నుండి ప్రజలను పక్కదారి పట్టించడానికి, జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టడానికి, ఒక భయానక వాతావరణాన్ని సృష్టించడానికి, ప్రజలపైన క్రూరనిర్బంధాన్ని ప్రయోగించటానికి, రాజ్యం ఎప్పుడు అవసరమైతే అప్పుడు వీటిని ఒకసాకుగా వినియోగించుకొంటున్నది. కాంగ్రెస్ పాలకులు మతోన్మాదాన్ని, జాతీయ దురహం కారాన్ని ఏవిధంగా అమలు జరిపారో మనం చూశాం. వారు తమిళ, సిక్కు తదితర టెర్రరిస్టు గ్రూపులను పెంచిపోషించి, ఉపయోగించుకొని, తర్వాత తుడిచిపెట్టారు. 1984లో ఇందిరా గాంధీ క్రూరంగా హత్యగావించబడిన తర్వాత ఢిల్లీలో మారణకాండను, విధ్వంసాన్ని సృష్టించటానికి కాంగ్రెస్ అల్లరి మూకల వెనకుండి ఎలా సమర్ధించిందో మనం చూశాం. సంఘ్‌పరివార్‌కు చెందిన హిందుత్వశక్తులు గుజరాత్‌లో ఏవిధంగా ముస్లింలకు వ్యతిరేకంగా మారణ హోమానికి పాల్పడ్డాయో; బాబ్రీమసీదును కూల్చివేయటానికి వారి మూకలు ఎలాంటి దాడి, దురాక్రమణ చర్యలకు పాల్పడ్డాయో; ప్రముఖ హేతువాదులపైన, ప్రగతిశీల, ప్రజాస్వామిక వాదులపైన, దేశంలోని వివిధ ప్రాంతాలలో దళిత, ముస్లిం యువకులపైన దాడులను, హత్యా కాండలను సాగించాయో ప్రపంచమంతటికీ తెలుసు.

**ముగింపు:**

1. సంఘ్ పరివార్ భావజాలం, రాజకీయాలు, ఆచరణ అంతా ఫాశిస్టు స్వభావం కలిగినది. వారు దేశంలో మతోన్మాదాన్ని, దురహంకారాన్ని అశాస్త్రీయ, తిరోగామి, అంధ విశ్వాసాలను, చీలికవాద ఆలోచనలను, శక్తులను ప్రోత్సహిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు, బడా బూర్జువా, భూస్వామ్యవర్గాల ప్రయోజనాలకు సేవచేయడానికే వారు అంకితమయ్యారు. మన దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక ఉద్యమాల అభివృద్ధిని ఆటంకపరుస్తున్నారు. పక్కదారి పట్టిస్తున్నారు. అందువల్ల మనం ఖచ్చితంగా మార్క్సిజం-లెనినిజం పునాదిగా ఈ భావజాలానికి, రాజకీయాలకు, ఆచరణలకు వ్యతిరేకంగా పోరాడాలి, పూర్తిగా ఎండగట్టాలి. మతతత్వ, అశాస్త్రీయ, తిరోగామి, విచ్ఛిన్నకర ఆలోచనలు, ఆచరణలు ఏరూపంలో ప్రతి పాదించబడినా అవి నిర్వహించే పాత్ర ఒక్కటే. అందువల్ల మన వ్యతిరేకత, పోరాటం వారందరికీ వ్యతిరేకంగా విస్తరిస్తుంది.

2. కార్మిక, కర్షక, ఇతర అణచబడిన వర్గాల ప్రజల ఉద్యమాలు బలహీనంగా వున్నప్పుడు నిరంకుశ, ఫాశిస్టుశక్తులు పెరగటానికి, యధేచ్ఛగా వ్యవహరించటానికి అనుకూలమైన భూమిక ఏర్పడుతుంది. ఒక బలమైన, సంఘటిత కార్మిక, కర్షక, ఇతర వర్గాల ప్రజల ఉద్యమం మాత్రమే ఫాశిస్టుశక్తులకు, భారత పాలకవర్గాల, భారత రాజ్య నిరంకుశ, ఫాశిస్టు దాడులకు వ్యతిరేకంగా ప్రభావవంతంగా పోరాడగలుగు తుంది, నిరోధించగలుగుతుంది. అందువల్ల మనం ఖచ్చితంగా దోపిడీకి గురవుతున్న, అణచ బడిన ప్రజలను ఐక్యపరచి, సంఘటితపరచి, సామ్రాజ్యవాదానికి, ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా వర్గపోరాటాలలోకి, రాజకీయ పోరాటాలలోకి సమీకరించే ప్రయత్నంపై శ్రద్ధపెట్టి దృష్టిని కేంద్రీకరించాలి. ప్రజలకు నాయకత్వాన్ని అందించడానికిగాను కమ్యూనిస్టు విప్లవకారులు తమ శక్తులను ఐక్యపరచి, ఒక బలమైన పార్టీని నిర్మించాలి.

3. పోరాటాలకు-సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజల ప్రజాస్వామిక పోరాటాలు పునాదిగా లేకపోతే లేదా వాటిని భారతదేశంలో నేడున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య సామాజిక వ్యవస్థను రద్దుచేసే పోరాటంతో అనుసంధానించకపోతే, ఫాశిస్టు భావాలకు, శక్తులకు, ఆచరణలకు, ఫాశిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటం బలహీనంగా, అలంకారప్రాయంగా మాత్రమే వుండిపోతుంది.

ఈరోజున భారత పాలకవర్గాలు తీవ్రమైన కోలుకోలేని సంక్షోభంలో వున్నాయి. ప్రజలపైన మరింత భారాలను మోపి, సామ్రాజ్యవాదుల ముందు మరింత సాగిలపడడంతప్ప మరో మార్గం గూర్చి ఆలోచించగలిగిన స్థితిలో వారు లేరు. మనదేశంలో నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లే గట్టి పునాదిపై ఆధారపడి, కార్మిక, కర్షక, ఇతర అణచబడిన వర్గాల ప్రజలు మరింత సంఘటితమైన, దృఢమైన పోరాటాలకు తమను తాము సన్నద్ధం చేసుకోవడంతప్ప మరో ప్రత్యామ్నాయం లేదు.

**మార్చి 7, 2019**

**కేంద్రకమిటీ**
**సిపిఐ(ఎం.ఎల్)**

ంంంం